ఆంధ్రజ్యోతి

**

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

బుధవారం 17 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	262
సూర్యాపేట	రూ.130	230	260
నల్లగొండ	రూ.158	230	264

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.5 । కనిష్ఠం 24.4

మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్టపై లక్ష్మీనరసింహ స్వామి కొండపై భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రధానాలయ ప్రాంగణంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దాతల సహాయంతో పాటు ప్రభుత్వ నిధులతో పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



నడకదారిలో సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఈవో భాస్కర్‌రావు, అధికారులు

గుట్టలో భక్తుల సౌకర్యాలపై నజర్

- నడకదారిలో రూ.60 లక్షలతో సోలార్ ప్యానళ్లు
- క్షేత్ర ప్రాశస్త్యం చాటేలా బోర్డులు
- రూ.20లక్షలతో ఎల్ఈడీ లైట్లు
- బాలాలయం స్థానంలో వాహన పూజలు

గుట్ట ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటికే ఆలయ అధికారులు, వైటీడీఏ అధికారులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆదేవిధంగా ఇటీవల దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు కమిషనర్, ఆలయ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కొండపై భక్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఎండకాలంలో భక్తులు ఇబ్బందులు పడకుండా కొండపైన ప్రధాన ఆలయ మాడవీధుల్లో జర్మనీ టెక్నాలజీతో షెడ్లను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కలిగింది. ప్రధానాలయంతో పాటు మాడ వీధులను కృష్ణ రాతి శిలలతో నిర్మించారు. దీంతో ఎండల తాపానికి భక్తులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో భక్తుల కోసం మ్యాట్లు ఏర్పాటు చేసి, వాటిపై నీటిని చల్లుతున్నారు.దీంతో భక్తులకు ఇబ్బంది తప్పింది. కొండపై భక్తుల పాత ఆచారాలను పునరుద్ధరించారు. 2022 మార్చి 28ఆలయ ఉద్ఘాటన జరగ్గా, నాటి నుంచి కొండపైన ఉన్న పాత ఆచారాలను పక్కనపెట్టి వీటి నిర్వహణకు ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కొండపైన పాత ఆచారాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.ఈమేరకు ప్రభుత్వం అధికారులతో చర్చించి ఇటీవల స్వామివారి సన్నిధిలో టెంకాయ సమర్పించే స్థలాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కొండపైకి ఆటోలను అనుమతించారు. రాత్రి వేళ భక్తులు నిద్ర చేసేందుకు క్యూకాంప్లెక్స్‌లో గతంలో శివాలయం ఉన్న స్థలంలో డార్మెటరీ హాల్‌ను ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్లు కూర్చునేలా కుర్చీలు కూడా ఏర్పాటు చేశారు.

వాహన పూజలకు ఏర్పాట్లు

కొండపైన బాలాలయాన్ని పూర్తిగా కూల్చివేయడంతో అక్కడ స్థలం ఖాళీగా ఉంది. దీంతో ఈప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. ఈ ప్రదేశాన్ని వాహనాల పూజలకు కేటాయించనున్నారు.ఇక్కడ కాంక్రీట్ వేసి, నాలుగు, ద్విచక్ర వాహనాలకు పూజలు నిర్వహించనున్నారు. ఈ స్థలంలో కళావేదికతో పాటు కల్యాణ మండపాన్ని నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ స్థలంలో తాత్కాలికంగా వాహన పూజలు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఆలయ ఈవో భాస్కర్‌రావు ఈ స్థలాన్ని పరిశీలించారు.

రూ.60లక్షలతో సోలార్ ప్యానళ్లు

కొండపైకి నడకదారిలో వెళ్లే భక్తులు ఎండవేడిమికి ఇబ్బందులు పడుతున్నారు. అయితే మొదటగా ఈ దారిలో నడిచే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులు ప్రతిపాదించారు. అయితే చలువ పందిళ్ల స్థానంలో దేవస్థానం కోసం విద్యుత్ ఉత్పత్తికి కూడా వినియోగించేలా సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు రూ.50లక్షల నుంచి రూ.60లక్షలతో ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాతలతో పాటు ప్రభుత్వ సహకారంతో ఈ సోలార్ వ్యవస్థతో ఆలయానికి విద్యుత్‌తో పాటు నడకదారిలో భక్తులకు నీడ లభించనుంది. రూ.20లక్షలతో ఆలయ ప్రాంగణంలో ఎల్ఈడీలను కూడా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాతలు, ప్రభుత్వ సహకారంతో కొండపైన ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని నిర్ణయించాం. నడకదారిలో రూ.60లక్షలతో సోలార్ ప్యానళ్లు, బాలాలయంలో వాహన పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రూ.20లక్షలతో ఆలయ ప్రాంగణంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నాం. కొండపైకి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైటీడీఏ అధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటున్నాం.

- ఆలయ ఈవో భాస్కర్‌రావు

మూడు భాషల్లో దేవస్థాన ప్రాశస్త్యం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాశస్త్యాన్ని చాటేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ చరిత్రతోపాటు యాదగిరీశుడి ప్రాశస్త్యం భక్తులకు తెలిసేలా రథ మండపం సమీపంలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో లిఖించి, భక్తులు చదువుకునేలా బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. రథ మండపం ఎదుట గార్డెన్ ప్రాంతంలో పలు సౌకర్యాల కల్పనకు ఆలయ అధికారులు ఆర్కియాలజీ శాఖతో చర్చించారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

నేడు అంతటా శ్రీరామనవమి వేడుకలు

ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. జిల్లాలోని ప్రతీ పల్లె, పట్టణాల్లోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారాము ల కల్యాణం ఉత్సవంతో జిల్లా అంతటా రామతత్వం నెలకొంది. జిల్లాకేంద్రం భువనగిరితోపాటు అన్ని ప్రాంత్రాల్లోని ఆలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులకోసం, చలువ పందిళ్ల వేశారు. బెల్లం పానకం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. కాషాయ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీల తో అలంకరించారు. ఆలయాల్లో రోజం తా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం అనంతరం ఆయా ప్రాంతాల్లో కల్యాణమూర్తులను ఊరేగించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శ్రీరామనవమి వేడుకల్లో భక్తులను కలిసేలా పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రణాళికలను రూపొందించుకున్నారు.





పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్ గ్రామంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

●7లో..



కావాలనే ఫోన్ ట్యాపింగ్ వివాదం

● మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

●7లో..



కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు


● భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య

●7లో..

బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

నల్లగొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీశ్రేణులను సమన్వయం చేసే నిమిత్తం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక బీఆర్ఎస్ కీలకనేతను నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదేశాలిచ్చారు. నల్లగొండ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాగార్జునసాగర్‌కు జడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, హుజూర్‌నగర్‌కు ఒంటెద్దు నరసింహారెడ్డి, దేవరకొండకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మిర్యాలగూడకు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కోదాడకు కటికం సత్తయ్యగౌడ్, సూర్యాపేటకు ట్రైకార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్ నియమితులయ్యారు.

భువనగిరికి నంద్యాల దయాకర్‌రెడ్డి, ఆలేరుకు ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామకు యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నానికి మాజీ ఎమ్మెల్యే ఎం.యాదగిరిరెడ్డి, మునుగోడుకు జడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, నకిరేకల్‌కు జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, తుంగతుర్తికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ సమన్వయకర్తలుగా నియమితులయ్యారు.



రేపటి నుంచే నామినేషన్లు

» అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. 18వ లోక్‌సభ ఎన్నికలకు ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా, అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు మే 13న పోలింగ్ జరగనుంది. రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, బందోబస్తు తదితర అధికారిక కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఓటింగ్ శాతం పెంచేందుకు యువత, వృద్ధులు, మహిళల ఓటింగ్ పెరిగేలా ఉమ్మడి జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈనెల 18నుంచి 25వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థులు 25ఏళ్లు నిండిన వారై, ఏదో ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి. అయితే అతడిని పోటీచేసే నియోజకవర్గానికి చెందిన ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది.అభ్యర్థి స్వయంగాగానీ, ఆయన ప్రతిపాదకులు గానీ నామినేషన్లు దాఖలుచేయవచ్చు.అభ్యర్థులు నామినేషన్‌తో పాటు ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలకు సంబంధించిన అఫిడవిట్లు సమర్పించాలి.

సీనియర్ సిటిజన్లకు హోమ్ ఓటింగ్

ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలు ఈ దఫా ఎన్నికల్లో అమల్లోకి తెచ్చారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో 9,587 మంది సీనియర్ సిటిజన్ ఓటర్లు ఉన్నారు. 33,865 మంది ఉద్యోగ ఓటర్లున్నారు. 180 మంది ప్రవాస భారతీయ ఓటర్లు నమోదయ్యారు. మొత్తం ఓటర్లలో 60,116 మంది (18-19) మొదటిసారి ఓటు వేయనున్నారు.

70శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 70శాతం అంటే 1,450 పోలింగ్‌స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో రికార్డవడంతో పాటు, ఈ ఫుటేజీ కేంద్ర ఎన్నికల సంఘం మొదలు జిల్లా ఎన్నికల అధికారి వరకు వీక్షించేలా ఆన్‌లైన్ ద్వారా ప్రసారం చేయనున్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల బయట ఒక కెమెరా క్యూలైన్లను, పోలింగ్ ముగిసేవరకు వీడియో రికార్డింగ్ చేయనుంది. నియోజకవర్గంలో మొత్తం 202 రూట్లను ఏర్పాటు చేయగా, సెక్టర్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఈ రూట్లలో, ప్రత్యేకించి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తారు. మొత్తం 202 రూట్లకు 25శాతం అదనంగా 225 మంది సెక్టార్ అధికారులను నియమించారు.

సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు

పోలీస్, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర, అంతర్‌జిల్లాల సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అక్రమ నగదు, మద్యం, ఇతర అనుమతిలేని వాహనాలను కట్టడిచేసేందుకు ఈ చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగుతోంది. నల్లగొండ లోక్‌సభకు ఏపీలోని పల్నాడు జిల్లాతో సరిహద్దు ఉండే వాడపల్లి, నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి టేల్‌పాండ్ డ్యా మ్ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అటు సూర్యాపేట జిల్లాలో చింత్రియాల, మట్టపల్లి, మహంకాళిగూడెం, పులిచింతల ప్రాజెక్టు, బుగ్గమాదారం, దొండపాడు, రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్ ప్లాజా, చింతపల్లి మండలం మాల్ వద్ద, మిర్యాలగూడ మండలం ఆలగడప, డిండిమండలం గుండ్లపల్లి వద్ద, చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద అంతర్‌జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. మరోవైపు సూర్యాపేట జిల్లాలో గోవిందాపురం, తంగెడ, మహంకాళిగూడం, పులిచింతల చెక్‌పోస్టు, మాదిపాడు, ముక్త్యాల, గరికెపాడు వద్ద కూడా చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి.

836 మందికి ఒక పోలింగ్ స్టేషన్

నల్లగొండ లోక్‌సభ పరిధిలో 17,22,521 మంది ఓటర్లు ఉండగా, అధికారులు 2,061 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1,029 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్, గ్రామీణ ప్రాంతాల్లో 773 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. సగటున 836 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించినట్టయింది. పట్టణ ప్రాంతాల్లో 505 పోలింగ్ స్టేషన్లు, గ్రామీణ ప్రాంతాల్లో 1,556 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 1,436 ప్రాంతాల్లో ఈ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు.

25శాతం అదనంగా సిబ్బంది నియామకం

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయి. మొత్తంగా 25శాతం సిబ్బందిని అదనంగా నియమించి అందుబాటులో ఉంచారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఒక పోలింగ్ అధికారి, అదనపు పోలింగ్ అధికారితో పాటు మరో ఇద్దరు పోలింగ్ సిబ్బందిని నియమించారు. ప్రతీ కేంద్రంలో నలుగురు చొప్పున విధులు నిర్వహిస్తారు. మొత్తం 2,061 స్టేషన్లకు 2,473 మంది పోలింగ్ అధికారులు, 2,473 మంది సహాయ పోలింగ్ అధికారులు, 4,946 మంది పోలింగ్ సిబ్బంది మొత్తం 9,892 మంది పోలింగ్ విధుల్లో పాల్గొనేందుకు అందుబాటులో ఉంచారు.

తాగునీరు సహా అన్ని వసతులు

వేసవి కాలంలో ఎన్నికలు రావడంతో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందిలేకుండా పలు సదుపాయాలు కల్పిస్తున్నారు. తాగునీటి ఏర్పాట్లతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కేంద్రాలుండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మిస్తున్నారు. అదేవిధంగా కేంద్రాల వద్ద విద్యుత్ సదుపాయాలు, ఫ్యాన్లు, టాయిలెట్లు, ఓటర్లు వేచి ఉండేందుకు షెడ్లు, పిల్లల కోసం క్రెచ్‌లను కూడా ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

39,905 లీటర్ల మద్యం స్వాధీనం

ఇప్పటివరకు అక్రమంగా తరలిస్తున్న రూ.3.28కోట్ల నగదు, రూ.1.10కోట్లు విలువచేసే 39,905 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.8.09కోట్ల విలువైన ఆభరణాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

84 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళ, మోడల్ పోలింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు, యువతనుద్దేశించి ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలకు ఐదు కేంద్రాలు, మరో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఒక్కోటి చొప్పున ఉద్యోగుల, యువత పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొత్తం 84 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఈ పార్లమెంట్ పరిధిలో ఏర్పాటుకానున్నాయి.

చెక్‌పోస్టుల్లో మరింత నిఘా పెంచాలి

కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 16: జిల్లా సరిహద్దు చెక్ పోసుల్లో మరింత నిఘా పెంచాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా నియమించిన అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో చేపట్టిన సమీక్ష సమావేశంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్ లతతో కలిసి పాల్గొని మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ నెల 18వ తేదీ నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు.

జిల్లాలో ఎంసీసీ బృందాలు నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అన్ని చెక్‌పోస్టుల్లో మరింత నిఘా పెంచాలని, జిల్లాలో అక్రమ మద్యం, నగదు, బంగారం ఇతర వస్తువులు సరఫరా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 1,201 పో లింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు సమస్యాత్మక కేంద్రాల్లోనూ, బయట కూడా వెబ్‌క్యాస్టింగ్ చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నియమించిన బృందాలు పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల నిర్వహణ సిబ్బంది,ఇతర అధికారులు 7,194మంది ఉన్నారని తెలిపారు.85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 6070 ఉన్నారని, వీరంతా ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అవకాశం కల్పించామన్నారు. అదేవిధంగా 40శా తం వైకల్యం ఉన్నవారు 16,949 మంది ఉన్నారని, వీరికి 12-డీ ఫాం అందించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీవోలు సూర్యనారాయణ, వేణుమాదవ్, శ్రీనివాస్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సిద్ధంగా ఉండాలి: నల్లగొండ కలెక్టర్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 16: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అధికారులు సిద్ధంగా ఉండాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వరంగల్-ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను సజావుగా నిర్వహించేందు కు ఆయా జిల్లాల నుంచి అవసరమై న సిబ్బంది, అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల వివరాలను తక్షణమే సమర్పించాలన్నారు. రూట్ మ్యాప్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వివరాలు సైతం సమర్పించాలన్నారు. జిల్లాస్థాయి అధికారులను, పార్లమెంట్ ఎన్నికల్లో నోడల్ అధికారులుగా వ్యవహరించిన వారినే ఎమ్మెల్సీ ఎన్నికకు సైతం నోడల్ అధికారులుగా నియమించాలని,పోలింగ్ సామగ్రి, వాహనా ల విషయంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బడ్జెట్ వివరాలను సైతం ముందే సమర్పించాలని కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా కలెక్టర్

భానుడి భగభగలు

జిల్లాలో 44.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 16: జిల్లాలో భానుడి భగభగలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పొద్దస్తమానం వేడితో ఉడికి పోతున్న ప్రజలు, రాత్రయ్యే సరికి ఉబ్బరింతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం 44.2 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా మునగాలలో 44.2డిగ్రీలు నమోదు కాగా, నూతనకల్, పెన్‌పహాడ్‌లో 43.5 డిగ్రీలుగా నమోదైంది. అత్యల్పంగా తుంగతుర్తి మండలంలో 39.8డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలి : కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 16: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ మిల్లులకు పంపాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు, చెల్లింపులు, మౌలిక వసతులపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి పాల్గొని మాట్లాడారు. అన్నికేంద్రాల్లో కొనుగోలు విధానం పారదర్శకంగా జరగాలన్నారు. ఇప్పటివరకు 32,305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.5.50కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఎండ తీవ్రత, అకాలవర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు చెల్లింపుల్లో ఎక్కడా ఇబ్బందులు రావద్దని, నియమించిన మండలస్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, డీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంవో నాగేశ్వరశర్మ, డీఎం రాములు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, చిత్రంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే

అప్రమత్తంగా ఉండాలి

రోజురోజుకూ పెరుగుతున్న వేడిగాడ్పులకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖతో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎప్పటికప్పుడు ఎండ నుంచి రక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మండల అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కోటాచలం, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, ప్రోగ్రాం అధికారులు, డిప్యూటి డీఎంహెచ్‌వోలు నిరంజన్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

అజ్మాపురంలో పల్లె ప్రకృతివనం దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 16 : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామ పల్లె ప్రకృతి వనం దగ్ధమైంది. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అజ్మాపురం గ్రామ శివారులో ఎకరం భూమిలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటుచేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో వనంలో మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్థులు మంటలను ఆర్పివేయడానికి ప్రయత్నించగా అదుపులోకి రాకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ప్రకృతి వనం నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలు మొలిశాయి. సమీపంలో ఊరు ఉండడంతో సమయానికి ఫైర్‌ఇంజన్ చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. ఎండిన గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డితో పాటు 100కు పైగా మొక్కలు కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 16: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, నృసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం, సీతారామచంద్ర స్వామి వసంతోత్సవాలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,38,002 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కొండపైన నిత్య వాహన పూజల నిర్వహణకు గతంలో బాలాలయం ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని ఈవో ఏ.భాస్కర్‌రావు సివిల్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కొండపైన పూజలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే చర్చ సాగింది.



ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

మొరాయించిన ఈ-నామ్ సర్వర్

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 16: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో అమలవుతున్న జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈ-నామ్) సర్వర్ మంగళవారం మొరాయించింది. ఉదయం 12గంటలకే ఈ-నామ్ టెండర్లు పూర్తి కావల్సి ఉండగా సాయంత్రం మూడు గంటల వరకు సర్వర్‌లో సమస్యతో టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. సర్వర్ డౌన్ కావడంతో ఖరీదుదారులు ఆన్‌లైన్‌లో టెండర్లు వేయడానికి అవస్థలు పడ్డారు. సకాలంలో టెండర్లు పూర్తి కాకపోవడంతో ఖరీదుదారులతో పాటుగా రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఢిల్లీలోని ఈ-నామ్ కేంద్ర కార్యాలయంలో సాంకేతిక లోపం తలెత్తడంతో టెండర్లు ఆలస్యమైనట్లు మార్కెట్ కార్యదర్శి రాహుల్ తెలిపారు. మార్కెట్‌లో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోళ్ల కోసం ఎదురుచూశారు. మార్కెట్‌లో ఈ-నామ్ ప్రవేశపెట్టిన నాటి నుంచి సర్వర్ ఇబ్బందులు రాలేదని, సర్వర్ మొరాయించడం ఇదే మొదటిసారని మార్కెట్ అధికారులు తెలిపారు. సాధారణంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో టెండర్ల నిర్వహణ ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటల్లోపు పూర్తవుతుంది. ధాన్యం కాంటాలు నిర్వహించడం, ఎగుమతులు చేయడం, రైతులకు డబ్బులు చెల్లింపు ప్రక్రియ సుమారుగా నాలుగుగంటల వరకు పూర్తవుతుంది. అయితే మంగళవారం వెబ్‌పోర్టల్ మధ్యాహ్నం మూడు గంటల వరకు కూడా పనిచేయలేదు. సాయంత్రం 3.30గంటల సమయంలో సమస్య పరిష్కారం కావడంతో టెండర్ల ఆన్‌లైన్ ప్రక్రియను ఖరీదుదారులు మొదలు పెట్టారు. సాయంత్రం 3.30కు ఆన్‌లైన్‌లో టెండర్ల ఫారాలు విడుదల కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆన్‌లైన్ బిడ్డింగ్ వేసిన కొద్ది నిమిషాలకే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో టెండర్ ఫాంలు డౌన్‌లోడ్ కావడం, ధరలు బయటకురావడం వెంటవెంటనే జరిగిపోయాయి.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం/ కోదాడ, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం, కోదాడ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన హామీలను అమలు చేయని బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీల వైఖరిని ఎండగట్టారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి, తెలంగాణ ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పాలని నిలదీశారు. ఈ నెల 18న కోదాడలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి ప్రచార సభను విజయవంతం చేయాలని, ప్రతీ బూత్ నుంచి 10 మందికి తగ్గకుండా హాజరుకావాలని సూచించారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, సామినేని ప్రమీల, వంగవీటి రామారావు, ముత్తవరపు పాండురంగా రావు, పారా సీతయ్య, కందుల కోటేశ్వరరావు, వరప్రసాద్‌రెడ్డి, వెంకన్న,శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయం

మిర్యాలగూడ/ మిర్యాలగూడ టౌన్: దేశంలో ఎవరెన్ని కుట్రలు చేసినా కేంద్రంలో అధికారంలోకి వచ్చేది ఇండియా కూటమినేనని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభకు పార్లమెంట్ మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి హాజరయ్యారు. ఎంపీ అభ్యర్థితో కలిసి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో కార్యకర్తలు వందలాదిగా పాల్గొన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన సభలో అతిథులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే బొందపెట్టామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కనీస మద్దతు ధర చెల్లించని వారిపై చర్యలు తప్పవన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారన్న కేటీఆర్‌కు మతిభ్రమించిందన్నారు. ఆసియాలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉన్న మిర్యాలగూడ పట్టణానికి ఔటర్‌రింగ్ రోడ్డు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలో రఘువీర్‌రెడ్డికి లక్ష ఓట్ల మెజార్టీ తెస్తానన్నారు. సమావేశంలో డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్, ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, భారతీరాగ్యానాయక్, రాజారమేష్, స్కైలాబ్ నాయక్, చిలుకూరు బాలు, పొదిల శ్రీను, ఎంఏ. సలీం, తలకొప్పుల సైదులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, శాగ జలంధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జయలక్ష్మీ, సునీత, నందిత, నర్సింహరావు, అర్జున్ పాల్గొన్నారు. రఘువీర్‌రెడ్డి ఎన్నికల ప్రచార పాటను మంత్రులు, జానారెడ్డి కలిసి విడుదల చేశారు. ఇదిలా ఉండగా సాగర్ నియోజకవర్గం కంటే ఎక్కువ మెజార్టీ తీసుకువస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ సవాల్ విసిరారు. వివిధ పనుల పరిష్కారానికి సహకరించాలని మంత్రులను ఆయన కోరారు.



మిర్యాలగూడ సభలో ఎన్నికల పాటను విడుదల చేస్తున్న మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి

కేసీఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం



సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 16: పదేళ్ల కేసీఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీష్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చాక అక్రమంగా వందల ఎకరాలు సంపాదించారని, ఆయన చేసిన అవినీతిపై జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బర్రె జహంగీర్, పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, రామాంజనేయులుగౌడ్, కుంభం కీర్తిరెడ్డి, పద్మ పాల్గొన్నారు.

21న చామల నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 21న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్నారని ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కావాలనే 'ఫోన్ ట్యాపింగ్' వివాదం



హాలియాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

దేవరకొండ / హాలియా, ఏప్రిల్ 16 : రాష్ట్రంలో విద్యుత్ కోతలు, కరువు సమస్యలను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వివాదాన్ని తెరపైకి తెస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ, హాలియాల్లో నిర్వహించిన పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి పాల్గొని, మాట్లాడారు. సాగర్ ఆయకట్టు కింద పొలాలు ఎండిపోతున్నా నీళ్లు ఇచ్చి కాపాడలేకపోయారని ఇదే కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు అన్నారు. 2014లో సాగర్ డ్యాంలో ఇంత కంటే నీరు తక్కువున్నా ఆ నాడు రైతులను కాపాడేందుకు సీఎం కేసీఆర్ నీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడినట్లు గుర్తు చేశారు. కంచర్ల కృష్ణారెడ్డి వివాదరహితుడని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఫోన్‌ట్యాపింగ్ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపితే రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబు కూడా దొరికిపోతాడన్నారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, యడవల్లి విజయేందర్‌రెడ్డి, కడారి అంజయ్య, బాబురావునాయక్, బిక్షానాయక్, జడ్పీటీసీ సూర్యబాష్యనాయక్, ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, చెన్ను సుందర్‌రెడ్డి, జువ్వాజి వెంకటేశ్వర్లు, వడ్త్య రమేష్‌నాయక్, నేనావత్ కిషన్‌నాయక్, కేతావత్ బిల్యానాయక్, గాజుల ఆంజనేయులు, రాజినేని వెంకటేశ్వరరావు, కేసాని లింగారెడ్డి, ఏర్పుల గోవిందు, అంజిరెడ్డి, రాజు, కృష్ణ పాల్గొన్నారు. హాలియా సమయంలో ఉద్యమకారుడు రావులపాటి ఎల్లయ్య ఉద్యమకారులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తపరుస్తూ వేదిక ముందుకు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి వారించి బయటకు పంపించారు.

కాంగ్రెస్ మూల్యం చెల్లించకతప్పదు



ఉదయసముద్రం ప్రాజెక్టును పరిశీలిస్తున్న బూర నర్సయ్యగౌడ్

నార్కట్‌పల్లి / మర్రిగూడ / చండూరు / రామగిరి / మునుగోడు, ఏప్రిల్ 16 : సాగు నీరు లేక అల్లాడుతున్న రైతు గోసకు కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకుంటుంని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ప్రాజెక్టుల బాటలో భాగంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల వద్ద నిర్మించిన ఉదయసముద్రం ప్రాజెక్టును, మర్రిగూడెంలోని చర్లగూడెం రిజర్వాయర్‌ను నర్సయ్యగౌడ్ మంగళవారం సందర్శించారు. ఉదయసముద్రం ప్రాజెక్టుకు నిధులు కేటాయించని బీఆర్ఎస్ ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఖైల నర్సింహ, పిట్టల శ్రీను, మల్లెబోయిన రమేశ్, పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, పాల్వాయి భాస్కర్ రావు, మేడబోయిన శ్రీనివాస్, మునుకుంట్ల గణేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, చలమల్ల సత్తిరెడ్డి, పంగ విజయ, పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, పందుల రాములుగౌడ్, మాజీ సర్పంచ్ చిట్యాల యాదగిరి రెడ్డి, ఆనంద్‌రావు, లాల్‌నాయక్, పరమేష్, పరుశరాం, గోపాల్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

● చండూరు, మునుగోడుల్లో పార్టీ ఎన్నికల కార్యాలయాలను నర్సయ్యగౌడ్ ప్రారంభించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, దాసరి మల్లేశం, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్,జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నర్సింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, మండల, పట్టణ అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు, పందుల సత్యంగౌడ్, పార్టీ మునుగోడు మండల అధ్యక్షుడు పెంబర్ల జానయ్యయాదవ్, నరేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, శంకర్ రెడ్డి, వెంకన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● నల్లగొండలో పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ 400 సీట్లతో హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కేంద్రంలో మోదీనే ఉండాలని దేశమంతా కోరుకుంటుందన్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, లింగస్వామి, పిల్లి రామరాజు యాదవ్, బీపంగి జగ్జీవన్‌రావు, వంగూరి రాఖీ, గడ్డం మహేశ్ ఉన్నారు.

సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లుల్లో అధికారులు సోదాలు

తిరుమలగిరి రూరల్ / నాగారం, ఏప్రిల్ 16 : కస్టమ్ మిల్లింగ్ రైస్ చెల్లించని రైస్‌మిల్లుల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని సంతోష్ పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుతో పాటు నాగారం మండలం ప్రగతినగర్‌లోని రఘురాం రైస్‌మిల్లులో జిల్లా అదనపు కలెకర్లు ప్రియాంక, లతల నేతృత్వంలో రెవెన్యూ, సివిల్ సప్లయ్, విజిలెన్స్ విభాగానికి చెందిన 30 మంది అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్య రాశులను లెక్కించారు. లెక్కించడానికి వీలు కాకుండా అమర్చిన తీరును చూసి అధికారులు విస్తుపోయారు. సంతోష్ రైస్‌మిల్లులో 2020-21కు సంబంధించిన 11లక్షల ధాన్యం బస్తాలను సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు. తనిఖీ వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. తనిఖీల్లో అదనపు కలెక్టర్ ప్రియాంక, ఆర్డీవో వేణుమాధవరావు, జిల్లా సివిల్ సప్లయి అధికారి శోభన్‌బాబు, తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం, చివ్వెంల తహసీల్దార్ల బృందం పాల్గొంది.

మిల్లు యజమానిని అదుపులోకి తీసుకుని...

నాగారం మండలంలోని ఈటూరు రెవెన్యూ పరిధిలోని ప్రగతినగర్ సమీపంలోని రఘురాం రైస్ ఇండస్ట్రీస్ పార్‌బాయిల్డ్ మిల్లులో అదనపు కలెక్టర్ లత నేతృత్వంలో తనిఖీలు మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. రైస్‌మిల్లు యాజమాని ఇమ్మడి సోమనర్సయ్యను సుర్యాపేటలో పోలీసులు సహాయంతో సివిల్ సప్లయ్ అధికారులు అదుపులోకి తీసుకుని తిరుమలగిరికి తీసుకువచ్చారు. అతడి మిల్లులపై తనిఖీలు చేస్తున్నారు. రాత్రి 10 గంటల వరకుతనిఖీలు కొనసాగుతున్నాయి. సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన 10 లక్షలకు పైగా బియ్యం బ్యాగులు ఇవ్వనట్లు సమాచారం. ఇదిలా ఉండగా 2020-21 , 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లుకు పంపిన ధాన్యంలో సివిల్ సప్లయ్ అధికారులకు సీఎంఆర్ బియ్యం ఇవ్వకపోవడంతో సోమనర్సయ్యను డిఫాల్డర్‌గా గుర్తించి రైస్‌మిల్లును బ్లాక్‌లిస్టులో పెట్టారు.



తిరుమలగిరి మండలంలో సంతోష్ పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

నిద్రిస్తున్న మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

మోటకొండూరు, ఏప్రిల్ 16: ఊరి చివర ఇళ్లు.. ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం దిలావర్‌పూర్‌లో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తాటికాయల అనిత, ఆమె భర్త నరేందర్‌తో కలిసి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి పుస్తెలతాడు అపహరించుకుపోయాడు. అతను ఎత్తుకెళ్లిన పుస్తెలతాడు గిల్టీది కాగా, దానికి ఐదు గ్రాముల బంగారు రూపు ఉందని బాధితురాలు తెలిపారు. తెంచుకుపోయే సమయంలో నిద్రలోంచి తేరుకున్న తాను కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడన్నారు. బాధితులు పోలీసులకు సమాచారమివ్వటంతో డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీ రమేష్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ తేజంరెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజంరెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే అనిత ఇల్లు ఊరికి దూరంగా ఉంది. అయితే ఊరి చివర ఇళ్లలో ఉండే వాళ్లు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ సూచిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో బెట్టింగ్ నిర్వాహకుడు?

చిట్యాల రూరల్, ఏప్రిల్ 16 : ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన ఓ యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఓ యాప్ ద్వారా క్రికెట్ అభిమానులతో సెల్‌ఫోన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అయితే బెట్టింగ్‌లో ఇతరుల ప్రమేయం వివరాలను తెలుసుకునేందుకు యువకుడిని విచారిస్తూ పూర్తి ఆధారాలు సేకరిస్తున్నట్లుగా తెలిసింది. యువకుడిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని స్థానిక పోలీసులు ఖండిస్తున్నారు.

సద్దుల చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 16 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెర్వులో గుర్తు తెలియని మహిళా మృతదేహం మంగళవారం సాయంత్రం లభ్యమైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల మహిళా బ్లూ కలర్ చీర, ఆరెంజ్ కలర్ జాకెట్ ధరించి ఉందన్నారు. మృతురాలి కుడి చేతిపై ఉమ అని పచ్చబొట్టుతో రాసి ఉందన్నారు. చెర్వులో మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు సమాచారం అందించారని, మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్ ఫోన్‌నెంబర్ 7793950000, పట్టణ ఇన్‌స్పెక్టర్ 8712686005 ఫోన్‌నెంబర్‌కు తెలపాలన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 16 : రేషన్ బియ్యం నిల్వల్లో తేడాలు ఉండటంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జావిద్ తెలిపారు. మంగళవారం లావూడితండాలో రేషన్‌దుకాణాన్ని తనిఖీ చేయగా 12.01 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి, డీలర్ చిలువేరు వినోద్‌పై 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం దుకాణంలోని నిల్వలను పక్కనే ఉన్న చిల్లాపురం రేషన్ డీలర్‌కు అప్పటించినట్లు తెలిపారు. లావూడితండాలో లావూరి శంకర్ అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు ఆర్ఐ సురేందర్‌సింగ్ దాడి చేసి 30క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అయితే బియ్యం నిల్వ ఉంచిన దానిలో రేషన్ డీలర్ పాత్ర ఉందనే అనుమానంతో రేషన్‌షాపులో బియ్యం నిల్వలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీకాంత్ వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ నరేందర్ తన వాహనంలో 60 బస్తాల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోని వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

రూ. 90వేలు పట్టివేత

చిట్యాలరూరల్, ఏప్రిల్ 16 : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి చెక్‌పోస్టు వద్ద జరిపిన తనిఖీల్లో రూ.90 వేలను ఎస్ఎస్‌టీ బృందం, పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ వెళ్తున్న సరుకులు రవాణా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న రూ.90 వేలకు ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని నల్లగొండ ట్రెజరీకి తరలించామని పోలీసులు తెలిపారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు

నేరేడుచర్ల, మఠంపల్లి, ఆత్మకూర్(ఎస్), ఏప్రిల్ 16: శ్రీరామనవమి ఉత్సవాలకు జిల్లాలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయం, అయోధ్య రామాలయం, విద్యానగర్‌లోని రామాలయం, శివాజీనగర్, పాత నేరేడుచర్ల, కమలానగర్‌లో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. నూతనంగా నిర్మిస్తున్న కోదండరాముడి ఆలయం, విద్యానగర్ రామాలయం, హుజూర్ నగర్ రోడ్డులో అయోధ్య రామాలయం ప్రాంగణాల్లో అన్నదానం కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



కోదాడలో తలంబ్రాలను కలుపుతున్న మహిళలు

మఠంపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఉన్న కోదండరాముడి ఆలయం 40వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నరగిరినాధుని లక్ష్మీనరసింహాచార్యులు, సాయికృష్ణ తెలిపారు. బుధవారం స్వామివారి ఎదుర్కోళ్ల ఉత్సవం అనంతరం సీతారామ కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు

● శ్రీరామనవమి వేడుకలకు మఠంపల్లి మండలంలోని పెదవీడు, కృష్ణ తండా, రామచంద్రాపురంతండా, యాతవాకిళ్ల భీల్యానాయక్, కాల్వపల్లి తండా, చౌటపల్లి, మఠంపల్లి, మట్టపల్లి తదితర గ్రామాల్లో రామాలయాలను ముస్తాబు చేశారు. నవమి వేడుకల సందర్భంగా రఘునాథపాలెం, యాతవాకిళ్ల రామచంద్రాపురం, గుర్రంబోడుతండా, కృష్ణతండాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో కల్యాణోత్సవాలకు ముస్తాబైన కోదండరామస్వామి ఆలయం

● సీతారాముల కల్యాణోత్సవానికి ఆత్మకూర్(ఎస్) మండలంలోని రామాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. రామాలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. నెమ్మికల్‌లో దండు మైసమ్మ కమిటీ ఆధ్వర్యంలో రామాలయంలో కల్యాణ వేడుకలను నిర్వహించనున్నారు. ఏపూర్, బొప్పారం, మిడతనపల్లి, కందగట్ల, పాతర్లపహాడ్, తుమ్మల పెన్‌పహాడ్, కోటపహాడ్ తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీలు సిద్ధమయ్యాయి.

హరితహారం మొక్కలకు నిప్పు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: మండలంలోని దూపహాడ్ గ్రామ శివారులో హరితహారం మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు అంటించారు. చుట్టుపక్కల గడ్డివాములు ఉండటంతో గ్రామస్థులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



దూపహాడ్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలి

చిలుకూరు, ఏప్రిల్ 16: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి యాదా రమేష్ కోరారు. మంగళవారం మండలంలోని బేతవోలులో బూత్ కమిటీలను, మండల కోఆర్డినేటర్లను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుపరిపాలన, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీ ఓటు వేసి మోదీని ప్రధాని చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రణబోతు వెంకట్‌రెడ్డి, కందరబోయిన సైదులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

నేరేడుచర్ల, ఏప్రిల్ 16: పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మునిసిపల్ అధికారులు, సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. జాన్‌పహాడ్ రోడ్డును 60 అడుగులమేర విస్తరిస్తూ, ఆక్రమణలను గతంలో తొలగించారు. అయితే కొందరు అక్రమంగా నిర్మాణాలను మళ్లీ చేపట్టారు. ఈ అక్రమ కట్టడాలను మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి తన సిబ్బందితో ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని మునిసిపల్ కమిషనర్ హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు ఉన్నా, కొందరివి మాత్రమే తొలగిస్తున్నారని, రాజకీయ పలుకుబడి ఉన్న వారి ఆక్రమణలు తొలగించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నేరేడుచర్లలో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పాఠశాలలో పనులు వేగవంతం చేయాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మేగ్యాతండా గ్రామ పంచాయతీ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. మంచినీటి సౌకర్యం, నల్లాల ఏర్పాటు, నీటి పైపుల అనుసంధానం, తరగతి గదుల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కిరణ్‌కుమార్, ఎంఈవో రవి, హెచ్‌ఎం శోభన్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16: 'ఉపాధి' పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో రవి అన్నారు. మంగళవారం మండలంలోని మహ్మదాపురంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 'ఉపాధి' కూలీలు సమయపాలన పాటించాలని, పనులను నాణ్యతగా చేయాలని సూచించారు. ఎస్సారెస్పీ పిల్ల కాల్వలో పనులను వేగవంతం చేయాలన్నారు. పనిప్రదేశంలో 'ఉపాధి' కూలీలకు నీడ సౌకర్యం, నీటి వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో టీఏ రామ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జానయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ జిల్లా ఇన్‌చార్జిగా రామచంద్రరావు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 16: ఓబీసీ సెల్ జిల్లా ఇన్‌చార్జిగా మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన శెట్టి రామచంద్రరావును నియమించారు. ఈ మేరకు తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రామచంద్రరావు

దిర్శించర్లవాసికి డాక్టరేట్

నేరేడుచర్ల, ఏప్రిల్ 16: మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన చిట్యాల రాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డాక్టరేట్ సాధించారు. రాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సైఫాబాద్ సైన్స్ కళాశాలలో కంప్యూటర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఏపీ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే వివిధ రకాల స్మార్ట్ డివైస్‌ల అతంటికేషన్, డాటా సెక్యూరిటీ విషయంలో ఎదురయ్యే సవాళ్లను మిషన్ లెర్నింగ్‌తో ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై చేసిన పరిశోధనలకు ఉస్మానియా యూనివర్సిటీ రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు, తన భార్య సహకారంతో డాక్టరేట్ సాధించానన్నారు. సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మానాయక్‌కు కంప్యూటర్ విభాగం సహ లెక్చరర్లకు, డిపార్ట్‌మెంట్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



రాజు

25 నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలు

మఠంపల్లి, ఏప్రిల్ 16: మఠంపల్లి శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను ఈనెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల కరపత్రాలను మంగళవారం మఠంపల్లిలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీనియర్ విభాగంలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.1.50లక్షల నుంచి మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆరు పళ్ల విభాగంగా మొదటి బహుమతిరూ.50వేలతో పాటు మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కేటగిరీ విభాగంలో మొదటి బహుమతి రూ.70వేలతో పాటు మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. నాలుగు పళ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30వేలతో పాటు మొత్తం ఏడు స్థానాల్లో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే రైతులకు తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు శుభోదయ యువజన సంఘం సెల్ నెం. 9618764924ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ

సూర్యాపేట టౌన్, పాలకవీడు, ఏప్రిల్ 16: అవగాహనతో అగ్నిప్రమాదాలను నియంత్రించవచ్చని సూర్యాపేట అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అగ్నిప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చని అన్నారు.కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రవీణ్‌కుమార్, రాకేష్, నగేష్, సత్యనారాయణ, యాకుబ్, పాల్గొన్నారు

● పాలకవీడు మండలం భవానీపురంలో ఉన్న డెక్కన్ సిమెంట్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలు, ప్రమాదాల నివారణ, వాటిని ఎదుర్కొనే పద్ధతులపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.నాగమల్లేశ్వరరావు, వివిధ శాఖాధిపతులు పీఎస్‌రావు, డి.కల్యాణచక్రవర్తి, పి.నర్సింహారెడ్డి, జగన్మోహన్‌రావు, కేవీఎల్ నర్సింహ, గోపాలకృష్ణ, ప్రవీణ్‌కుమార్, మస్తాన్, తిరుపతి, రమణ, రమేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తిరుమలగిరి మండలం మర్రికుంటతండలో 'ఉపాధి' కూలీలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వందన

తిరుమలగిరి రూరల్, హుజూర్‌నగర్, ఏప్రిల్ 16: వడదెబ్బ తగలకుండా 'ఉపాధి' కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి వందన సూచించారు. వడదెబ్బపై ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని చింతలకుంటతండ, మర్రికుంట తండ గ్రామాల్లో 'ఉపాధి' కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున 'ఉపాధి' కూలీలు ఉదయం ఏడు గంటలకే పనికి వచ్చి ఎండలు తీవ్రతరం కాకముందే ఇంటికి వెళ్లాలని సూచించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపకుమారి, శ్రీలత, వెంకటమ్మ, రజిత పాల్గొన్నారు.

● ఎండలతో ఇటుకబట్టీల కార్మికులు జాగ్రత్తగా ఉండాలని హుజూర్‌నగర్ మండల వైద్యాధికారి పుష్పలత కోరారు. పట్టణంలోని ఇటుకబట్టీల కార్మికులకు ఎండలు, వడగాల్పులపై అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి మాట్లాడారు. మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇందిరాల రామకృష్ణ, నూర్జహాన్‌బేగం పాల్గొన్నారు.

గుండెపోటుతో మునిసిపల్ కార్మికురాలు మృతి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 16: పట్టణంలోని మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికురాలు కస్తాల ముత్తమ్మ(53) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు భర్త, నలుగురు పిల్లలు ఉన్నారు. ముత్తమ్మ కుమారుడు కస్తాల శ్రావణ్ 11వ వార్డు కౌన్సిలర్. ముత్తమ్మ మృతికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సంతాపం తెలిపారు. ముత్తమ్మ మృతదేహంపై మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్‌రావు, సతీష్, విజయ్, కారింగుల వెంకటేశ్వర్లు, ఎంపీపీ గూడెపు శ్రీను, గల్లా వెంకటేశ్వర్లు, శీతల రోషపతి, మీసాల కిరణ్, శరత్, నాగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రహదారిపై ఎద్దుల పోట్లాట

కోదాడ, ఏప్రిల్ 16: పట్టణంలోని రామాలయం ఎదురుగా రహదారిపై మంగళవారం రెండు ఎద్దులు పోట్లాడుకున్నాయి. అరగంట పాటు ఎద్దులు హల్‌చల్ చేయటంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. పోట్లాడుకుంటున్న ఎద్దులను స్థానిక వ్యాపారులు గద్దించడంతో పాటు నీళ్లు పోస్తూ, కర్రలతో వాటిని భయపెట్టే యత్నం చేసినా అవి ఏమాత్రం తగ్గలేదు. పరస్పరం పొడుచుకుంటూ ప్రజలు, వాహనాల మీదకు వెళ్లాయి. అదే సమయంలో ఆర్టీసీ బస్సు రావటంతో ఓ ఎద్దు ఆర్టీసీ బస్సు, డివైడర్ మధ్య ఇరుక్కుంది. దీంతో మరో ఎద్దు వెనుదిరిగింది. ఈ పోట్లాటలో దుకాణాల ఎదుట నిలిపిన పలు బైకులు ధ్వంసం అయ్యాయి. ప్రమాదాలు జరగకముందే మూగజీవాలు రహదారిపై రాకుండా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కోదాడలో పోట్లాడుకుంటున్న ఎద్దులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగారం, ఏప్రిల్ 16: మండలంలోని ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరబోయిన గూడెం గ్రామ శివారులో ఉన్న బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం నాగారంలో పట్టుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. సదరు ట్రాక్టర్ యాజమాని ఓ ఈపేపరు విలేకరి అని ఎస్ఐ తెలిపారు.

కోదాడ సభను విజయవంతంచేయాలి




నడిగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం, ఏప్రిల్, 16: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయం కోసం కోదాడలో ఈనెల 18న నిర్వహించే ప్రచారసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పద్మావతి కోరారు. మంగళవారం నడిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి బూత్ నుంచి కనీసం ఐదుగురు మహిళలు తరలిరావాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికలకు మించి మెజార్టీ తీసుకురావడానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్యారి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా మునగాల, మోతె మండలాల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జడ్పీటీసీ బానాల కవిత, ప్రమీల శ్రీనివాస్, పుల్లారావు, వైస్ ఎంపీపీలు బడేటి వెంకటేశ్వర్లు, బుచ్చి పాపయ్య, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను, నళిని, శ్రీలత, ఉపేంద్రమ్మ పాల్గొన్నారు

'రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలి'

మఠంపల్లి, ఏప్రిల్ 16: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు భూక్య పాండునాయక్ అన్నారు. మంగళవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ మోటర్లకు మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, 55ఏళ్లు నిండిన రైతులకు రూ.10వేలు పింఛను అందించాలని, పంట రుణాలను మాఫీచేయాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున 'ఉపాధి' కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కిలోమీటర్ల దూరం పనికి వెళ్లివస్తున్న కూలీల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలోతు బాలునాయక్, శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, వినోద్, వెంకటరెడ్డి, సయ్యద్ రన్‌మియా, శంభయ్య, కేశ్యానాయక్, మట్టపల్లి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట క్రైం: అర్హులైన ప్రతి ఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేయాలని సూర్యాపేట సీఐ జి.రాజశేఖర్ కోరారు. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు లోకేష్, లింగం, మహేంద్రనాథ్, బాలకృష్ణ, కుశలవ, పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మాదిగలకు ఒక్కసీటు కూడా కేటాయించకుండా అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ములకలపల్లి రవి అన్నారు. ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, నవిల వెంకన్న, గంగరాజు, పల్లెల రాములు, చిన్ని, వెంకన్న పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని దోసపహాడ్ గ్రామంలో సీతారామాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఇరువంటి వెంకటరమణశాస్త్రి, సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, తదనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొంగరి సుధాకర్, దొంగరి యుగంధర్, స్వాతి, వెంకటాచారి, శ్రీరాములు, బోనయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని గోపాలపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రముఖ న్యాయవాది కాలువ శ్రీనివాసరావు కోరారు. గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మిషన్‌భగీరథ నీటిని ట్యాంకులకు ఎక్కించి, వాటి ద్వారా గ్రామంలోని అన్ని వార్డులకు నీటిని సరఫరా చేయాలన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలోని అనేక వార్డుల్లో నీటి ఎద్దడి నెలకొందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

● ప్రభుత్వం రంగ స్థల కళాకారులను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ కోరారు. హుజూర్‌నగర్‌లో రంగస్థల కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులకు పింఛన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలన్నారు. పండుగలు, జాతరల సందర్భంగా ప్రభుత్వమే కళా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, రమేష్, వాసుదేవరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో పశువులకు నల్లగొండకు చెందిన దాత వీరవెల్లి శ్రీహరి రూ.10వేల విలువైన ట్రాక్టర్ గడ్డిని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి పాల్గొన్నారు

మోతె: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హుస్సేనాబాద, మోతె గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు.

మునగాల రూరల్: మంచినీటి సమస్యకు పరిష్కారం చూపడం హర్షణీయమని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సోమపంగు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో ఎస్సీ కాలనీకి ప్రైవేటు బోరును కొనుగోలు చేసి 40పైపుల ద్వారా నీటిని అందిస్తున్నందుకు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలగిరి: గౌరెల్లి-కొత్తగూడెం జాతీయరహదారిలో భాగంగా తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో ఫ్లైఓవర్ నిర్మించొద్దని పలువురు షాపుల యజమానులు కోరారు. తిరుమలగిరిలో ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈఎన్‌సీ అధికారులు మంగళవారం వచ్చిన సందర్భంగా పలువురు షాపుల యజమానులు కోరారు. గతంలో ఫ్లైఓవర్ నిర్మించొద్దని సంతకాలు చేసి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో ఎన్నో ఏళ్లుగా ఉపాధి పొందుతున్న తమ వ్యాపారాలు దెబ్బతింటాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ చీఫ్ గణపతిరెడ్డి మాట్లాడుతూ ఈ నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి వై.దీన్‌దయాల్ కోరారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బూర నర్సయ్యగౌడ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఎంపీగా మళ్లీ ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మేడబోయిన యాదగిరి, కొండ సోమయ్య, యాకవరెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.